సాక్షి
చిత్తూరు
గురువారం । 31 । జూలై । 2025



విధుల్లో అలసత్వం వద్దు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి హెచ్చరించారు. - 8లో



అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

రాత్రి పూట తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. - 8లో



మన'సారా' మాన్పిస్తారా?

నాటు సారా నిర్మూలనకు నవోదయం 2.0 లక్ష్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈనెల లోపు సారా నిర్మూలన సాధ్యమయ్యేనా? - 8లో

న్యూస్‌రీల్

గృహాల పురోగతిలో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గృహాల పురోగతిలో అలసత్వం వద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలన్నారు. పురోగతిలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కొన్ని నియోజకవర్గాల్లో పురోగతిలో వెనుకబడి ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ డీఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్రమం తప్పకుండా గృహ నిర్మాణాల పురోగతిని నిత్యం సందర్శించాలన్నారు. జిల్లా మొత్తం 73,098 గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో 52,880 గృహాలు పూర్తి చేశారన్నారు. పెండింగ్‌లో 20,218 గృహ నిర్మాణాల పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఉమ్మడి సీనియారిటీనే అమలు చేయాలి



గిరిప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కోర్టు తీర్పు వచ్చే వరకు విద్యాశాఖ పరిధిలోని వివిధ కేడర్ పోస్టుల భర్తీకి ఉమ్మడి సీనియారిటీనే అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఎంఈవో-1 పోస్టులను ఎఫ్‌ఏసీలుగా ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంకు మాత్రమే కాకుండా స్కూల్ అసిస్టెంట్‌లతో భర్తీ చేసే ప్రక్రియను విరమించుకోవాలన్నారు. ఈ పద్ధతి సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ రూల్స్‌పై స్పష్టత రాకముందే ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం గొడవలు సృష్టించడమేనని మండిపడ్డారు. జీవో 154 ప్రకారం ఎంఈవో-1 పోస్టులు కేవలం 13 మాత్రమేనని తెలిపారు. అయినప్పటికీ మిగిలిన 666 పోస్టులను ఎంఈవో-1గా పరిగణిస్తూ పంచాయతీరాజ్ యాజమాన్యంలోని సీనియర్ హెచ్‌ఎంలను పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు.

పాఠశాలలకు స్మార్ట్ ఫోన్లు సరఫరా చేయండి



రెడ్డి శేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ ఫోన్‌లను సరఫరా చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కంటే యాప్‌ల వినియోగం ఎక్కువైందని ఆరోపించారు. టీచర్లు తమ అవసరాలకు మొబైల్ ఫోన్‌లు వాడుతున్నారన్నారు. అందులో పాఠశాల సమాచారం కు అదనంగా యాప్‌లు ఉండటంతో ఫోన్‌లు మొరాయిస్తున్నట్లు తెలిపారు. అలాగే వ్యక్తిగత డేటా సైతం హ్యాక్ అయ్యే అవకాశం ఉందని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి పాఠశాలకు అధునాతన సామర్థ్యం ఉన్న ఫోన్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా బయోమెట్రిక్ మిషన్లు సరఫరా చేయాలని కోరారు.

తప్పుడు నివేదికపై క్రమశిక్షణ చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలువురు తహసీల్దార్లు లోకాయుక్తకు ఓ భూ వివాద కేసు విషయంలో తప్పుడు నివేదిక సమర్పించినందుకు క్రమశిక్షణా చర్యల నిమిత్తం విచారణ చేయాలంటూ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలో గతంలో నగరి తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణ, కె.బాబు, వీఆర్వో దేవదాసులపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశించారు. ఎన్ఆర్ కుప్పం గ్రామంలోని సర్వే నంబర్ 4/2, 4/4, 109/1, 109/3లలోని ప్రభుత్వ భూములలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోలేదనే ఆరోపణలపై లోకాయుక్తకు తప్పుడు నివేదిక సమర్పించినట్లు పేర్కొన్నారు. ఆ అధికారులపై నమోదైన ఫిర్యాదులను విచారించేందుకు జాయింట్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా విచారణ అధికారికి మద్దతుగా నగరి ఆర్‌డీవోను నియమిస్తున్నట్లు సూచించారు. ఒక నెలలోపు విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఆదేశించారు.

నిసార్ గగన విహార్

షార్ కేంద్రం నుంచి 'నిసార్'.. జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ గగన తలంలోకి విజయవంతంగా దూసుకెళ్లడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. దేశంలో మొట్టమొదటిసారి ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్ 102 ప్రయోగం విజయవంతంగా కక్ష్యలోకి దూసుకెళ్లడంతో జయహో భారత్ అంటూ షార్‌లోని గ్యాలరీ వీక్షకుల కరతాళధ్వనులతో హోరెత్తింది. శాస్త్రవేత్తలకు దేశం నలుమూలల నుంచి అభినందనలు మిన్నంటాయి.

ఇస్రో, నాసా సంయుక్త ప్రయోగం

- భూమి ఉపరితల పరిశీలన, వాతావరణ మార్పులపై అధ్యయనం
- విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన శాస్త్రవేత్తలు
- భారత్-అమెరికా దేశాల సహకారంలో ఇదో మైలురాయి
- గ్యాలరీలో వీక్షకుల కేరింతలతో సందడి

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 ప్రయోగాన్ని బుధవారం సాయంత్రం 5.40 గంటలకు విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగాన్ని 18.40 నిమిషాల్లోనే ముగించి 2,392 కిలోలు బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. భూమి ఉపరితలం పరిశీలన, వాతావరణ మార్పులపై అధ్యయనం లాంటి వాటికి వినియోగించుకునేందుకు ఈ డ్యూయెల్ సింథటిక్ అపార్చర్ రాడార్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) మొదటిసారిగా కలిసిన చేసిన ప్రయోగం కావడం విశేషం. షార్ కేంద్రం నుంచి బుధవారం నిర్వహించిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 ప్రయోగంతో జీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో 18 ప్రయోగాలను పూర్తి చేశారు. ఇస్రో ప్రయోగాల పరంపరలో ఎన్నో మైలురాళ్లు దాటినప్పటికీ వంద ప్రయోగాల మైలురాయిని దాటి 102 ప్రయోగాలను పూర్తి చేశారు.



నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి ప్రయోగించిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్16 ప్రయోగం విజయవంతం కావడంతో ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇస్రో-నాసా కలిసి చేసి మొదటి ప్రయోగాన్ని విజయవంతం చేయడంతో ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు ఇతర శాస్త్రవేత్తలను అభినందించారు. ప్రపంచమే గర్వించదగిన రాకెట్ కేంద్రం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉండడం దేశానికి గర్వ కారణమన్నారు.

వీక్షకుల గ్యాలరీలో సందడి

తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్‌లో రెండో ప్రయోగవేదిక నుంచి బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల నుంచి సుమారు పది వేలమంది దాకా విచ్చేశారు. రాకెట్ ఎగురుతున్నంత సేపు జయహో భారత్... జయహో ఇస్రో... జయయో ఇస్రో అని నినాదాలు చేస్తూ జాతీయ జెండాను సగర్వంగా చూపించి సందడి చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట రోడ్డులో కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరి కనిపించాయి. అయితే షార్ కేంద్రం వారు ప్రతి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే రాకెట్ నింగికేగుతున్న సమయంలో వీక్షకులు కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది.



శ్రీహరికోటలోని జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 ప్రయోగాన్ని వీక్షిస్తున్న వేలాది మంది వీక్షకులు, విద్యార్థులు

జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 ప్రయోగ తీరును పరిశీలిస్తే..

- జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 రాకెట్‌కు మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 27.30 గంటల కౌంట్‌డౌన్ సమయంలో రాకెట్‌లోని లిక్విడ్ స్ట్రాపాన్ బూస్టర్లు, రెండో దశలో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రకియను చేపట్టారు. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగాన్ని ప్రారంభించి 18.40 నిమిషాల్లో ప్రయోగాన్ని పూర్తి చేశారు.
- కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే 0.00 నిమిషాలకు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనం , రాకెట్‌కు చుట్టూరా ఉన్న నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో నింపిన 160 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి మొదటిదశను 152 సెకెండ్లకు పూర్తి చేశారు.
- మొదటి దశకు రెండో దశకు మధ్యలో రాకెట్ శిఖరభాగంలో ఉపగ్రహాన్ని అమర్చిన హీట్‌షీల్డ్స్ 171.8 సెకెండ్లకు విడిపోయాయి. రాకెట్‌లోని రెండోదశను 149.6 సెకెండ్లకు మండించి 284.1 సెకెండ్లకు పూర్తి చేశారు.
- రాకెట్‌లోని మూడోదశ అంటే క్రయోజనిక్ దశను 294.06 సెకెండ్లకు మండించి 1100 సెకెండ్లకు కటాఫ్ చేశారు.
- ఆ తరువాత 1120 సెకెండ్లకు (18.40 నిమిషాలు) 2,292 కిలోలు బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టి ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.



షార్ రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్‌ఎల్‌వీ ఎఫ్-16 నింగి వైపు వెళ్లేందుకు మొదటిదశను మండిస్తున్న శాస్త్రవేత్తలు







మూడో దశలో రాకెట్ నిసార్ ఉపగ్రహంతో నిప్పులు చిమ్ముతూ నింగివైపుకు వెళ్తున్న దృశ్యం, నింగివైపు వేగంగా వెళ్తున్న దృశ్యం, మొదటిదశ పూర్తయి రెండోదశతో ప్రయాణిస్తున్న రాకెట్



క్రయోజనిక్ దశ మండుతూ ఉపగ్రహాన్ని కక్ష్య వైపు తీసుకెళ్తున్న దృశ్యం



రాకెట్లోని క్రయోజనిక్ దశ 2,392 కిలోల నిసార్ ఉపగ్రహాన్ని భూమికి 743 కిలోమీటర్లు ఎత్తులోని కక్ష్యలోకి విడిచి పెడుతున్న దృశ్యం



రిఫ్లెక్టర్ యాంటెన్నా విచ్చుకుని నింగిలో విహరిస్తున్న రాకెట్

అప్రమత్తంగా ఉండాలి

యాదమరి : ప్రతి బాంబు బెదిరింపు కాల్స్‌ను నిజమైందిగా భావించి వెంటనే స్పందించాలని ఎట్టి పరిస్థితిల్లోనూ అశ్రద్ధ వహించరాదని అడిషనల్ ఎస్పీ శివానందకిషోర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీసీఎల్‌లో బాంబు స్క్వాడ్ సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలకు ముప్పు ఎదురైనప్పుడు సమర్థవంతంగా, శాస్త్రీయంగా స్పందించే విధంగా అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ఐటీసీఎల్ వంటి ప్రాముఖ్యమైన ప్రదేశాలలో ఎటువంటి అవాంఛనీయ ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండటమే లక్ష్యంగా మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరహా డ్రిల్లుతో పోలీసు సిబ్బంది స్పందన వేగాన్ని పరీక్షించడం, పరిష్కార సామర్థ్యాన్ని మెరుగుపరచడం ముఖ్య లక్ష్యమన్నారు. అలాగే ఐటీసీఎల్ వంటి కీలక స్థలాల్లో ఎప్పటికప్పుడు భద్రతా వ్యవస్థను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్ భాష, ఎస్సై ఈశ్వర్, తహసీల్దార్ పార్థసారథి, ఐటీసీఎల్ సీటీఎం ప్రసాదరావు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

సఖ్యత లేకనే వివాదాలు

చిత్తూరు కలెక్టరేట్ : పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేకనే వారి మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని డీఆర్‌వో మోహన్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతులశాఖ ఆధ్వర్యంలో ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007, ట్రాన్స్‌జెండర్ హక్కుల చట్టం 2019పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులతో సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన, సొంత ఆస్తి నుంచి తనను తాను కాపాడుకోలేక పోయినప్పుడు ప్రాథమికంగా ఆర్‌డీవో అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సీనియర్ సిటిజన్, తల్లిదండ్రులకు ఆహారం, వైద్యం, వసతి తదితర ప్రాథమిక అవసరాలను తప్పనిసరిగా నెరవేర్చాలన్నారు. ఎవరైనా విస్మరిస్తే చట్టం ప్రకారం మూడు నెలల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తారన్నారు.

తల్లిదండ్రుల సంక్షేమం వారసులదే

తల్లిదండ్రుల సంక్షేమం వారసులదేనని సీనియర్ న్యాయవాది హిమబిందు అన్నారు. వృద్ధులు, తల్లిదండ్రులు తాము పొందాల్సిన హక్కులకు భంగం కలిగితే ఆర్‌డీవో పరిధిలోని ట్రిబ్యునల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓరియెంటేషన్ కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, డీఈవో వరలక్ష్మి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి పాల్గొన్నారు.



ఓరియెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌వో

పరిహారం కోసం రైతుల ఆందోళన

- హంద్రీ-నీవా కాలువ కోసం భూములిచ్చిన రైతులు
- పది మంది రైతులకు అందని పరిహారం
- 8 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు
- పట్టించుకోని సీఎం చంద్రబాబునాయుడు

గుడుపల్లె : చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి హంద్రీ-నీవా నీరు తీసుకువచ్చేందుకు కాలువ తవ్వారు. ఇందులో భాగంగా కుప్పం, గుడుపల్లె తదితర మండలాలకు చెందిన పలువురు రైతుల నుంచి భూమి సేకరించారు. గుడుపల్లె మండలం కాడేపల్లె, ఒంటిపల్లె గ్రామాలకు చెందిన 10 మంది రైతులకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదు. పరిహారం కోసం అధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో మంగళవారం పనులను అడ్డుకున్నారు. పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేయాలని భీష్మించారు.

భూములకు పరిహారం అందని రైతులు

హంద్రీ-నీవా కాలువకు భూములు కోల్పోయి పరిహారం అందని వారిలో పది మంది రైతులు వున్నారు. గోవిందమ్మకు సంబంధించి సర్వే నంబరు 60-1లలో 0.19 సెంట్ల భూమి, ఒక చింతచెట్టు, అలాగే 60-2లో 0.14 సెంట్లు, 60-3లో 0.17 సెంట్లు, 60-1లో 0.30 సెంట్ల భూమి తీసుకున్నారు. అలాగే సుందరప్పకు చెందిన భూమిలో సర్వేనంబర్ 60-2బిలో 0.17 సెంట్ల భూమి, బావి ఒకటి, 60-4బిలో 0.53 సెంట్లు, మునిరత్నంకు సంబంధించి సర్వే నంబర్ 61-3బిలో 0.07 సెంట్లు, లక్ష్మమ్మకు చెందిన 60-2బిలో 0.16 సెంట్లు, బోరు, టేకు చెట్లు 4, చింత చెట్లు 2, నీలగిరి చెట్లు 16, సాకమ్మకు సంబంధించిన సర్వేనంబర్ 60-2బిలో 0.12 సెంట్లు, చింతచెట్టు 1, చిగరచెట్లు 10, నాగప్పకు సంబంధించి సర్వే నంబర్ 61-6బిలో 0.21 సెంట్లు, 60-1లో 0.19 సెంట్లు, దేవేంద్రకు సంబంధించి సర్వే నంబర్ 26-1బిలో ఎకరా, 4 కొబ్బరి చెట్లు, చామంతి తోట 0.50 సెంట్లు, వెంకటప్పకు సంబంధించి సర్వేనంబర్ 22-సిలో 1.28 ఎకరాలు, సుందరప్ప సంబంధించి 63-1లో బావి ఉన్నాయి. వారికి ఎనిమిదేళ్లయినా పరిహారం ఇవ్వలేదు. భూములు కోల్పోయి పరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు, విజయవాడకు వెళ్లి మరీ అర్జీలు ఇచ్చినా పరిహారం అందలేదని బాధిత రైతులు వాపోతున్నారు.



హంద్రీ-నీవా కాలువలో బోరు



హంద్రీ-నీవా కాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పట్టాదారు పుస్తకాలు లాక్కున్నారు

హంద్రీ-నీవా కాలువకు భూములు సేకరించిన రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా లాక్కున్నారు. దీనివల్ల రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందడం లేదు. బ్యాంకు రుణాలు తీసుకోవడానికి కూడా వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిహారం ఇవ్వక పోగా పట్టాదారు పాసుపుస్తకాలు కూడా తీసుకోవడంతో తాము అన్ని విధాలా నష్టపోయినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమకు పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు

సేవల జాప్యంపై కొరడా

- రూ.30 లక్షల జరిమానా
- 40 మంది ఏఈల జీతాల నుంచి రికవరీకి ఆదేశాలు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొన్న సేవలోపానికి గాను జిల్లాలో రూ.30.36 లక్షలు 1,050 మంది వినియోగదారుల ఖాతాలకు జమ చేయాలని ఏపీఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు జిల్లాలో పలు సమస్యల పై అందిన ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యం జరిగినందుకు ఈ రుసుం దాదాపు 40 మంది ఏఈల జీతాల నుంచి రికవరీ చేయనున్నారు. కరెంటు పోయింది.. ఎప్పుడు వస్తుంది, స్తంభాలు మార్చండి, లైన్‌కు అల్లుకున్న తీగలు తీయండి వంటి సాధారణ సమస్యలపై ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు ఫిర్యాదులు ఇచ్చారు. వీటితో పాటు పలు అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన సర్వీసులు రిలీజ్ చేయడంలో ఆలస్యం అయినందుకు, సర్వీసులు రిలీజ్ అయిన పలు కారణాలతో పనులు చేయడానికి అనుమతి ఇవ్వలేదని వినియోగదారులు సమస్యలు వివరించారు. వీటికి ఇంత నష్ట పరిహారం అవసరమని ఏపీఈఆర్సీకు ఉన్నతాధికారులు నివేదించారు. తదనంతరం అనుమతులు వచ్చాయి. చిత్తూరు రూరల్ డివిజన్ పరంగా 198 ఫిర్యాదులకు గాను రూ.4.62 లక్షలు, చిత్తూరు అర్బన్ డివిజన్ 403 సమస్యలపై రూ.9.08 లక్షలు, పుంగనూరు పరంగా 449 ఫిర్యాదులకు రూ.16.65 లక్షలు జరిమానా, అపరాధ రుసుం వేశారు.

క్లుప్తంగా

డిప్యూటీ కమిషనర్ తనిఖీ



పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయకుమార్

శ్రీరంగరాజపురం : మండలంలోని నెలవాయి వద్ద నున్న ఎస్ఎన్‌జే డిస్లరీ ఫ్యాక్టరీని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిస్లరీ ఫ్యాక్టరీ పరిసరాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు , సలహాలు అందించారు. ఆయన వెంట ఎక్సైజ్ అధికారులు, ఫ్యాక్టరీ ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఏజీఎం రవికుమార్, హెచ్ఆర్ గిరి పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలకు స్థాన చలనం

చిత్తూరు అర్బన్ : జిల్లాలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను (సీఐ) అటాచ్‌మెంట్ ద్వారా బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. వేకెంట్ రిజర్వులో ఉన్న జయరామయ్యను కల్లూరు, అక్కడ పనిచేస్తున్న సూర్యనారాయణను చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలి



ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానం వర్తింపజేసేందుకు సీఎం ప్రత్యేక చొరవ చేపట్టాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2003 డీఎస్సీ టీచర్లకు కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. 2003 డీఎస్సీ టీచర్లు పాతపెన్షన్‌కు అన్ని విధాల అర్హులైనప్పటికీ నష్టపోతున్నారన్నారు. 20 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పాతపెన్షన్ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే తెలంగాణాలో ఇదే కేటగిరీకి చెందిన టీచర్లు, ఉద్యోగులకు పాతపెన్షన్ అమలు చేయాలని అక్కడి హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఏపీలో సైతం సీపీఎస్ అమలు తేదీ సెప్టెంబర్ ఒకటి 2004 కంటే ముందు నోటిఫికేషన్లు ఇచ్చి ప్రభుత్వ పాలనాపరమైన కారణాలతో సీపీఎస్‌లోకి వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలన్నారు. సీఎం స్పందించి ఈ సమస్యను పరిష్కరించి 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మనసారా మాన్పిస్తారా?

నాటుసారా నిర్మూలనకు నవోదయం 2.0లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. నెల రోజుల్లో సారా నిర్మూలన సాధ్యమవుతుందా అనేది? బేతాళ ప్రశ్నగా మిగులుతోంది. తరాలుగా సారాపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి చూపకుండా ప్రత్యామ్నాయం కల్పించకుండా నిర్మూలన అసాధ్యం. బ్యాంకర్లు వీరికి ఎలాంటి హామీ లేకుండా రుణాలు ఇవ్వడానికి ససేమిరా అంటున్నాయి. ప్రభుత్వం గతంలో నవోదయం తీసుకొచ్చి విఫలమైంది..మరోసారి నవోదయం 2.0 అంటూ ఆర్భాటం చేస్తోంది. ఆగస్టు చివరి నాటికి సారా నిర్మూలన క్షేత్ర స్థాయిలో సాధ్యమయ్యే పరిస్థితి కానరావడం లేదు.

- ఆగస్టు చివరికి నాటుసారా నిర్మూలన సాధ్యమయ్యేనా?
- నవోదయం 2.0 లక్ష్యం కోసం అబ్కారీ శాఖ పరుగులు
- క్షేత్రస్థాయిలో సారా తయారీదారులతో సమావేశాలు
- ప్రత్యామ్నాయ జీవనోపాధుల కోసం బ్యాంకు రుణాలు
- తాకట్టులేకుండా రుణాలు ఇవ్వబోమంటున్న బ్యాంకర్లు
- ప్రభుత్వం చోద్యం.. కలెక్టర్ వద్దకు చేరిన పంచాయతీ
- రుణాల కోసం 200 పైగా కుటుంబాల ఎదురుచూపులు



గుడిపాల అడవుల్లో సారా ఊటను వెలికి తీస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్ : జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలు ఆగస్టు నెలాఖరులోపు ఉండకూడదు. ఇదే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నవోదయం 2.0 లక్ష్యం. కానీ ఏళ్ల తరబడిగా ఇదే వృత్తిలో పాతుకుపోయిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించడానికి సిద్ధం చేసిన కార్యాచరణ ఆచరణలోకి రావడం అసాధ్యంగా కనిపిస్తోంది. అణగారిన కుటుంబాలకు చేయూత ఇవ్వాల్సిన ప్రభుత్వం.. ఆర్థిక భారం బ్యాంకులపై మోపి పక్కకు తప్పుకుంది. సారా తయారీ నుంచి ప్రభుత్వం నిజంగా బయట పడేస్తుందా..? కంటి తుడుపు చర్యలతో మళ్లీ అదే ఊబిలో ఉండిపోవాలో తెలియక వందలాది కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

ఆర్థిక స్థోమత లేక

జిల్లాలోని కొన్ని సామాజిక వర్గాలకు చెందిన అట్టడుగు వర్గాలు ఉండటానికి ఇళ్లు లేవు. సేద్యం చేసుకోవడానికి భూములు, సరైన పనులు దొరక్కపోవడంతో కుటుంబాన్ని నడిపించే ఆర్థిక స్థోమత లేక తప్పదన్నట్లు నాటుసారా తయారీని ఎంచుకున్నారు. దాదాపు 60–70 ఏళ్ల కిందట నుంచే సారా తయారీని వృత్తిగా ఎంచుకున్న కుటుంబాలు ఆ ఊబి నుంచి బయట పడలేకపోతున్నాయి. ఈ వృత్తిలో చేయి తిరిగిన బడా వ్యక్తులు లేకపోలేదు. కూలీలను తీసుకొచ్చి, నాటుసారా తయారు చేయించి అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తినవాళ్లూ ఉన్నారు. సారా తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తడం, సగటు మనిషి ఆయుష్షు తగ్గిపోతుండటం, సమాజంలో సారా తయారీ, సేవించే వాళ్లపై చిన్నచూపు కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా రూపాంతరం చెందాయి. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం అప్పుడే నవోదయం తీసుకొచ్చి.. ఆ కుటుంబాల్లో ఆర్థిక అసమానతలను తొలగించడంలో విఫలమయ్యింది.

తయారీ కేంద్రాలను గుర్తించి..

నవోదయం 2.0లో ఆగస్టు నెలాఖరులోపు జిల్లాలో ఎక్కడా నాటుసారా ఒక్క ప్యాకెట్ కూడా తయారు కాకూడదని మద్యపాన నిషేధ అబ్కారీ శాఖకు ప్రభుత్వం నిర్దేశం విధించింది. దీనిపై కసరత్తు ప్రారంభించిన అధికారులు చిత్తూరులోని రాసనపల్లె, పాలసముద్రంలోని నరసింహాపురం, నగరి సత్రవాడ, విజయపురం మంగళం, కెవి.పురం, పుంగనూరులోని పెద్దతండా, నల్లగుంట్లపల్లె తండా, పత్రపల్లె తండాల్లాంటి 52 సారా తయారీ కేంద్రాలను గుర్తించారు. సారా తయారీ తప్ప మరో దారి తెలియని 230 కుటుంబాలను గుర్తించారు. వీళ్లకు స్వయం ఉపాధి కల్పించడానికి బ్యాంకు రుణాలు ఇవ్వడమే ఏకైక మార్గమని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

ప్రత్యామ్నాయంగా జీవనోపాధి కల్పిస్తే..

సారా తయారీ ఒక్కటే మార్గం అనుకున్న కుటుంబాలు అకస్మాత్తుగా దీన్ని వదిలేయలేరు. వీళ్లకు సేద్యం చేయడానికి భూమి, స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు, ప్రభుత్వ–ప్రైవేటు రంగాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు, కార్పొరేషన్ల ద్వారా ఆటోలు, కార్లు లాంటి ప్రత్యామ్నాయ జీవనోపాధులు చూపిస్తే సారా తయారీ త్యజించడానికి వెనుకాడరు. అలాకాకుండా రూ.50 వేలు రుణం ఇస్తాం, గొర్రెలు ఇస్తాం, ఆవులు ఇస్తామని తాత్కాలిక దారులు చూపిస్తే మాత్రం సారాను ఎవ్వరూ వదలరనేది సుస్పష్టం. మరోవైపు ఎవరెవరికి ఏ రుణాలు ఇవ్వాలనేదానిపై ఎక్సైజ్ అధికారుల నుంచి కలెక్టర్‌కు ఫైలు వెళ్లింది. తాకట్టులేనిదే రుణం ఇవ్వబోమని బ్యాంకర్లు మొండికేసి కూర్చుకున్నారు. కలెక్టర్ ప్రత్యేకంగా కల్పించుకుంటే తప్ప ఈ చిక్కుముడికి పరిష్కారం లభించదు.

ఆ ఊబి నుంచి బయటపడేస్తాం



సారా తయారీ, విక్రయాలకు అలవాటు పడ్డ కుటుంబాల దారి మళ్లించి. ఆ ఊబిలోకి వెళ్లకుండా ఉండేందుకే మా శ్రమ అంతా. 200కు పైగా కుటుంబాలను గుర్తించి వీళ్లకు ఎలాంటి ఉపాధి అవకాశాల కల్పించాలో తెలుసుకోవడానికి గ్రామాల్లో సభలు నిర్వహించి ఫైనల్ చేశాం. సారా తయారీ మానుకుని, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక భరోసాతో కుటుంబాలు మారాలనే లక్ష్యాన్ని తప్పకుండా సాధిస్తాం.

– శ్రీనివాస్, ఈఎస్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, చిత్తూరు.

విధుల్లో అలసత్వం వద్దు

కార్వేటినగరం : విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ డీ.టీ.సుధారాణి హెచ్చరించారు. బుధవారం మండలంలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, రోగుల నుంచి ఫిర్యాదులు అందితే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరైన భవనం లేకపోవడంతో వర్షాలకు ఉరుస్తున్నాయని, మందులు తడిసిపోతున్నట్లు జిల్లా వైద్యాధికారిణి దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు, డీపీఎంఓ డాక్టర్ ప్రవీణ, డాక్టర్ గిరి, డాక్టర్ అనుష పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో గంజాయి అమ్ముతున్న సురేష్, కుమార్, ప్రభాకరన్, సీతారామన్ అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మహేశ్వర మీడియాకు వివరాలు వెల్లడించారు. నగరంలో ఇటీవల గంజాయి విక్రయాలు ఎక్కువగా ఉన్నాయంటూ పోలీసులకు సమాచారం రావడంతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గంజాయి అమ్ముతున్నారని తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఇక్కడ గంజాయి విక్రయిస్తున్న సురేష్, కుమార్, ప్రభాకరన్, సీతారామన్ అనే నలుగురిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులకు మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- తాళం వేస్తే ఇళ్లు గుల్లే..
- పదుల సంఖ్యలో కేసులు నమోదు

తిరుపతి క్రైమ్: రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పుత్తూరు డీఎస్పీ రవికుమార్, పుత్తూరు సీఐ ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకున్నారు. రెండు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులున్న తమిళనాడుకు చెందిన మనీ అలియాస్ కోవిల్ మనీ (38), సురేష్ అలియాస్ గుణ(35), తిరుపతి మంగళంకు చెందిన కుమార్(29), మణికంఠ(25), పట్టుబడ్డారు. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ప్రభు(26), మణిగండన్(47) ఇద్దరు పరారీలో ఉన్నారని వివరించారు. వీరంతా పలుమార్లు జైలు కెళ్లి జైల్లో పరిచయాల వల్ల ముఠాగా ఏర్పడ్డాయని చెప్పారు. వీరి నుంచి 190 గ్రాముల బంగారు, 2.3 కిలోల వెండి ఆభరణాలను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ సుమారు రూ.20.4లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసును ఛేదించడంలో పుత్తూరు పోలీసులు ఎంతగానో కృషి చేశారన్నారు. నిందితులందరిపై షీట్ ఓపెన్ చేస్తామన్నారు.

అక్రమ కేసుల నుంచి బయట పడాలని పూజలు



ఎంపీ మిథున్‌రెడ్డి త్వరగా బయటకు రావాలని బోయకొండ గంగమ్మకు పూజలు చేస్తున్న నాయకులు

కార్వేటినగరం : పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక అణచివేత దిశగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసుల నుంచి త్వరగా బయటకు రావాలని బోయకొండ గంగమ్మకు కార్వేటినగరం మండల నాయకులు బుధవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా కొల్లాగుంట ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక సీఎం చంద్రబాబు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయించారని, ఇలాంటి అక్రమ కేసులకు ఎవరూ బయపడబోరని, కూటమి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం నేర్పుతారన్నారు. అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఇదే ఆఖరి ఎన్నికలని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలని, అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిని కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను తొలగించడానికి బోయకొండ గంగమ్మ అండగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునికృష్ణ, మండల కార్యదర్శి నందగోపాల్ శెట్టి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాపూజీరెడ్డి, పంచాయతీ రాజ్ మండల విభాగం ఉపాధ్యక్షుడు జేజేలురెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాపర్ తీగల దొంగల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం గంగమ్మ గుడిలో విగ్రహం, ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ తీగలను చోరీ చేసిన నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. గంగమ్మ గుడిలోని పంచలోహ విగ్రహాన్ని చోరీ చేసి పరారీలో ఉన్న దినేష్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన చిరంజీవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరే మండలంలో రైతుల పొలం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలను దొంగతనం చేశారని నిర్ధారించారు. వీరిపై కేసు నమోదు చేసి చిత్తూరు కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

కాసులు కాజేసిన ఖాకీ !

– విచారణకు ఆదేశించిన చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్ : ఆపద వస్తే సహాయం కోసం ఎవ్వరైనా తొలుత పోలీసులకు ఫోన్ చేస్తారు. కానీ అదే పోలీసుల నుంచి ఆపద వస్తే ఎవరు చేయాలి..? చిత్తూరు శివారుల్లో 20 రోజుల కిందట జరిగిన ఓ ఘటన ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది. ప్రజలకు అండగా ఉండాల్సిన రక్షకభటులు.. భక్షక భటులుగా మారారనే ఆరోపణలు గుప్పుమనడంతో, ఈ ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఎస్పీ మణికంఠ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏం జరిగిందంటే..

పొగాకు ఉత్పత్తులు, గుట్కా ఉత్పత్తుల వ్యాపారం ప్రస్తుతం ఎలాంటి ఆంక్షలు లేకుండా జరుగుతోంది. ఏపీతో పాటు కర్ణాటకలో నిషేధం సడలించడంతో వ్యాపారాలు బాగానే జరుగుతున్నాయి. ఇదే సమయంలో వీటిని తమిళనాడుకు తీసుకెళ్లకూడదు. ఈ చిన్న లాజిక్కుతో తనిఖీ చేసే పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తోంది. చిత్తూరు–బెంగళూరు జాతీయ రహదారిలోని ఓ టోల్‌ప్లాజా వద్ద 20 రోజుల క్రితం చిత్తూరు నగరంలో గుట్కా వ్యాపారం చేసే ఓ ఉత్తరాది వ్యక్తి సరుకును బెంగళూరు నుంచి చెన్నైకు తరలిస్తున్నాడు. టోల్‌ప్లాజా వద్ద కాపు కాసిన చిత్తూరు నగరానికి చెందిన ఓ హైజాక్ ముఠా.. డ్రైవర్‌పై దాడిచేసి, గుట్కా సరుకు లాక్కెళ్లాలని పథకం పన్నారు. అయిదు మందికి పైగా యువకులు ట్రక్కును చుట్టుముట్టారు. ఇంతలో రాత్రి గస్తీలో ఉన్న పోలీసు వాహనం అటువైపు రావడంతో హైజాక్ ముఠా పారిపోయింది. పోలీసులు ట్రక్కును చూడగా భారీ మొత్తంలో గుట్కా, పొగాకు ఉత్పత్తులు ఉన్నాయి. వీటిని చెన్నైకు తీసుకెళుతున్నట్లు డ్రైవర్ చెప్పడంతో వాహనాన్ని అనధికారికంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉదయం చిత్తూరుకు చెందిన వ్యాపారి వచ్చి మామూళ్లు సమర్పించడంతో ట్రక్కుకు రూ.2 వేలు అపరాధ రుసుము విధించి పంపించేశారు. తీసుకున్న నగదులో సరైన వాటా రాకపోవడంతో ఈ విషయం బయటపడింది.

ఎక్కడ చూసినా ఇదే చర్చ

పోలీసుల వ్యవహారం బట్టబయలు కావడంతో ఎస్పీ మణికంఠ సీరియస్ అయ్యారు. గుట్కా వ్యాపారి నుంచి లంచం తీసుకున్న పోలీసు ఎవరో తెలుసుకునేందుకు అంతర్గతంగా విచారణకు ఆదేశించారు. ఇక పోలీసుశాఖ మొత్తం పాకిన ఈ విషయం ఏ ఇద్దరు పోలీసులు ఎదురెదురుగా తారసపడినా.. ''ఏమ య్యా, నువ్వేనా డబ్బు తీసుకుంది.'' అంటే ''ఛీ ఛీ, ఇలాంటి వాటికి నేను కక్కుర్తి పడను. మనకు రావాల్సింది దేవుడే ఇస్తాడు. పీడించి తీసుకుంటే దొరికిపోతాం....' అని మరొకరు.. 'నాకేమో నీపైనే డౌటుగా ఉంది..' అంటూ ఇంకొరు దీని గురించే మాట్లాడుకుంటున్నారు. విచారణలో ఏం తేలుతుందో..? తప్పు చేసిన వాళ్లు బయటపడుతారా..?లేక దొంగల నుంచి రూ.లక్ష లు వసూలు చేసి, విచారణలో తప్పించుకుని మంచి పోస్టింగులు దక్కించుకున్నట్లు ఈ ఘటన కూడా మరుగున పడిపోతుందో వేచి చూడాలి.

ప్రైవేట్ బస్సు ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన లోకేష్

శ్రీరంగరాజపురం : మండలంలోని శ్రీరంగరాజపురం సచివాలయం వద్ద బుధవారం రాత్రి ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. జీ.ఎం.ఆర్.పురం ఎస్టీ కాలనీకి చెందిన లోకేష్ (24) ద్విచక్ర వాహనంలో శ్రీరంగరాజపురంలో ఉన్న ద్రౌపదీ ధర్మరాజుల గుడి వద్దకు బయలుదేరాడు. చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిలోని శ్రీరంగరాజపురం గ్రామ సచివాలయం వద్ద ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించినట్లు తెలిపారు.

సోమల ఎంఈఓ-1 విజయకుమారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం సోమల ఎంఈవో–1 గా విజయకుమారిని నియమిస్తూ వైఎస్సార్ కడప జిల్లా పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం...సోమల మండలం ఎంఈవో–1 గా పనిచేస్తున్న శ్రీరాములు ఉద్యోగ విరమణ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆ మండలం ఎంఈవో–1గా గుడిపాల మండలం బొమ్మసముద్రం ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం బి.విజయకుమారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31 వ తేదీలోపు నూతన స్థానంలో బాధ్యతలు స్వీకరించి డీఈవోకు జాయినింగ్ రిపోర్టు అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పీఠంపై వేట !



కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం

- చైర్మన్ గిరికి పోటాపోటీ
- కాణిపాకం చైర్మన్ పదవిపై పలువురి ఆసక్తి
- మాజీ చైర్మన్‌కే మళ్లీ పగ్గాలంటూ ప్రచారం

కాణిపాకం : కాణిపాక క్షేత్ర చైర్మన్ కుర్చీపై టెన్షన్ మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చైర్మన్ కుర్చీపై పలువురు ఎక్కుపెట్టారు. ఆశావహుల్లో తీవ్ర పోటీ నెలకొంది. కొత్త ముఖాలు పుట్టుకొస్తున్నాయి.(టీడీపీకి చెందిన) మాజీ చైర్మన్‌కే మళ్లీ పదవి అంటూ మరోవైపు ప్రచారం జోరందుకుంది. మరోవైపు పలుకుబడి ఉన్నవాళ్లకు ఇస్తే మేలంటూ పలువురు కూటమి నేతలు, ఉభయదారులు యోచిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు ఖరారు కావడంతో చైర్మన్ ప్రకటన వచ్చే నెల ఉంటుందనే విషయం ఆశావహులతో పాటు కాణిపాక భక్తుల్లో ఉత్కంఠతను రేకెత్తిస్తోంది. జిల్లాలో కాణిపాకంలో స్వయంభుగా వెలసిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ప్రసిద్ధి చెందింది. నిత్యం వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు ఆలయానికి కానుక రూపంలో వస్తుంటాయి. అయితే ఐదేళ్ల కాలంలో ఆలయం అడుగడుగునా అభివృద్ధి పరుచుకుంది. ఈ అభివృద్ధితో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య, కానుకలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం భక్తుల సంఖ్య 10 వేల నుంచి 30 వేలు దాటుతోంది. ఈ స్థాయిలో ఉండే ఆలయానికి...చైర్మన్ కుర్చీ దక్కించుకునేందుకు ఆశావహులు పోటీపడుతున్నారు.

చైర్మన్ రాజీనామాతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి వరకు ఉన్న చైర్మన్‌గా ఉన్న మోహన్‌రెడ్డి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేసి ఏడాది కాలం దాటినా ఇంత వరకు కూటమి ప్రభుత్వం ఆ స్థానాన్ని భర్తీ చేయలేకపోతోంది. కొత్త పాలకవర్గంతో పాటు చైర్మన్‌ను ప్రకటించలేకపోతోంది. ఈ విషయాన్ని వాయిదాల మీద వాయిదాలు వేస్తూ...జాప్యం చేస్తూ వస్తోంది. ఈజాప్యంతో చైర్మన్ పదవికి పోటీపడేవారి సంఖ్య పెరిగింది. కూటమిలోని కొందరు నేతలు నీకా..నాకా అంటూ పోటీ పడుతున్నారు. ఇన్నాళ్లు నలుగురు మాత్రమే అనుకుంటే... ఇప్పుడు మరి కొంత మంది పోటీపడుతున్నట్లు కాణిపాక వాసులు చెబుతున్నారు.

స్థానికులకే అవకాశం ఇవ్వాలని..

చైర్మన్ పదవిని స్థానికులకే ఇవ్వాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. అందుకు కట్టుబడి చైర్మన్ పదవిని ఇవ్వాలని పలువురు కూటమి నేతలు, ఉభయదారులు, కాణిపాక వాసులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చాక మాజీ చైర్మన్‌కే..చైర్మన్ పదవి అంటూ ప్రచారం జరుగుతోంది. కొందరు బడా నేతలు కూడా మాజీకే కుర్చీ అంటూ పెదవి విరుస్తున్నారు. అయితే కూటమిలోని ఓ వర్గం మాత్రం మాజీకి రాకూడదని గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ముగ్గురు నేతలు మాజీ చైర్మన్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. ఆ నలుగురు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. తెలిసిన మంత్రులు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్ వద్ద సత్తా చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త ముఖాలు తెరపైకి..

ఇన్నాళ్లు ఆ నలుగురే పోటీ అనుకున్నారు. ఇప్పుడు మరో కొంత మంది పేర్లు తెరపైకి వస్తున్నాయి. అందులో ఐరాల మండలానికి చెందిన ఓ కూటమి నేత పేరు ప్రచారం జరుగుతోంది. గతంలో ఈ నేత తండ్రి రాష్ట్ర ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉన్నారని, దీంతో ఆ నేత భార్యకు చైర్మన్ సీటు అడుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే బెంగుళూరులో స్థిరపడి, ఆర్థికంగా బలపడిన ఓ బడా నేత కూడా తెరపైకి వచ్చారు. ఆ నేత ఇటీవలే అధిష్టానంను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న కొందరు నాయకులు వారికి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో చైర్మన్ కుర్చీ ఎవరికి ఇస్తారో అని పలువురు ఎదురుచూస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు ముందే..?

కూటమి అధికారంలోకి వచ్చాక ఒక బ్రహ్మోత్సవం ముగిసింది. మరో బ్రహ్మోత్సవానికి ముహూర్తం ఖరారైంది. కాణిపాకంలో ఆగస్టు 27వతేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇన్నాళ్లు ఇదిగో..అదిగో అంటూ పాలక వర్గంపై ఆశలు నిరాశలయ్యాయి. పాలకవర్గం ప్రకటింపు విషయంలో ఇప్పుడు కొత్త పల్లవి అందుకుంటోంది. బ్రహ్మోత్సవ ప్రారంభం వారానికి ముందు పాలకవర్గ ప్రకటన ఉండబోతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆశావహులు తెగ టెన్షన్ పడిపోతున్నారు. చాలా మంది మాజీ చైర్మన్‌కే కుర్చీ ఇస్తారని బల్లగుద్ది చెబుతున్నారు. అయితే పలువురు కూటమి నేతలు, ఉభయదారులు, అధికారులు ఆర్థికంగా బలమైన నాయకులకు ఇస్తే..ఆలయ అభివృద్ధికి దోహద పడుతుందని భావిస్తున్నారు. ఈ రకంగానే వారి అభిప్రాయాన్ని అధిష్టానానికి నివేదించినట్లు తెలిసింది. దీంతో అధిష్టానం నిర్ణయం ఎలా ఉండబోతుందని వారు ఎదురుచూస్తున్నారు.